# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు అన్నారు.
- ❖ "ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన" ద్వారా లబ్ధి పొందవచ్చని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.
- ❖ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు.

=====================

భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదేనని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పున్నమిఘాట్ నుంచి సీప్లేన్ పర్యాటకాన్ని ఈ రోజు ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో విమానాశ్రయాలే కాకుండా సీప్లేన్ ద్వారా రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

(వాయిస్ 29 సెకన్లు)

అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మరో 3 - 4 నెల్లలో ఆంధ్రప్రదేశ్ లో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, 4 మార్గాల్లో నడిపేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం ఉంటుందన్నారు. అనంతరం పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలం వరకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సీ ప్లేన్ లో ప్రయాణించారు.

=====================

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల చెంతకు చేర్చే ప్రయత్నం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో జిల్లా వ్యవసాయ శాఖ, రాగోలు  వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో 54 స్టాల్స్ తో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల కు అందిస్తే రైతులు అధిక దిగుబడులు సాధిస్తారన్నారు. రాగోలు  వరి పరిశోధనా కేంద్రంలో తయారైన వరి వంగడాలు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందటం జిల్లాకు గర్వకారణమని, ఈ వంగడాలు అమ్మకాల ద్వారా సుమారు 2 వేల కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యం అమ్మకాలు జరగడం విశేషమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో రైతులకు సాగునీరు అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో దిగుబడులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. రైతుల నుంచి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

=====================

“ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన” ద్వారా లబ్ది పొందవచ్చని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. నగరంలో ఈ రోజు నిర్వహించిన ప్రధానమంత్రి సూర్యఘర్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ పథకంలో రాయితీతో ఇంటిపై సోలార్ పై కప్పును ఏర్పాటు చేసుకోవడం ద్వారా, విద్యుత్ చార్జీలను తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండే అనంతపురం జిల్లాలో ఈ పథకం మరింత ప్రయోజన కరంగా ఉంటుందని పేర్కొన్నారు.

=====================

ఈ రోజు న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనా  కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కడపలో న్యాయ సేవా హక్కులపై  అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో  జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి మాట్లాడుతూ... సుప్రీం కోర్టు ఆదేశాలతో 1995 సంవత్సరం నుండి న్యాయ సేవల దినోత్సవం ప్రారంభమైందని, సత్వర న్యాయం అందేలా ఉచితంగా న్యాయ సేవలను అందించడమే ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో అమలాపురం రెండవ జిల్లా అదనపు న్యాయమూర్తి వి.నరేష్ పాల్గొని మాట్లాడారు. న్యాయ సేవా హక్కుల చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం  న్యాయ సేవాధికార  దినోత్సవం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. లోక్ అదాలత్ లో పరిష్కారమయ్యే కేసులు ఇరుపక్షాలకు సంతోషంగా ఉంటాయని, రాజీమార్గమే రాజమార్గమని జిల్లా అదనపు న్యాయమూర్తి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

విరామం

=====================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని  ఈరోజు ఉదయం మంత్రి దర్శించుకున్నారు. దర్శన అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పూర్తి స్థాయిలో సొంత ఇంటిని నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

=====================

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఈరోజు 59 మందిని నామినేటెడ్ పదవులలో  ఈరోజు నియమించింది. క్యాబినెట్ ర్యాంక్ హోదాతో రాష్ట్ర నైతిక విలువల సలహాదారునిగా చాగంటి కోటేశ్వరరావు, రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారునిగా మహమ్మద్ షరీఫ్ లను నియమించింది. పలువురు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీ నాయకులు ఇతర నామినేటెడ్ పదవుల్లో నియమించింది.

=====================

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగైతే మరిన్ని సంక్షేమ పథకాలను అమలు  చేస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు పెన్నా నది ఇసుకరీచులను ఆయన అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలు అవుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత ఇసుకను కూడా అమలు చేస్తున్నామన్నారు. ఇసుక ధర గణనీయంగా తగ్గిందని, ఎన్నికల హామీలను ఒక్కొటొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

దక్షిణ మధ్య రైల్వే పండుగల సందర్భంగా 860 ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. అందులో భాగంగా 07003 నెంబరుతో నడిచే  సికింద్రాబాద్ - పాట్నా ఎక్స్ ప్రెస్ ఈరోజు ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ లో బయలుదేరాల్సి ఉండగా రేపు తెల్లవారు జామున 2 గంటలకు మార్పు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

=====================

హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులను కేంద్ర పథకాల నిధులతో పూర్తి చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. తిరుపతిలోని కలెక్టర్ కార్యాయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల హౌసింగ్  అధికారులతో ఈరోజు మంత్రి సమీక్షా సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రదాన మంత్రి ఆవాస్ యోజన మొదటి విడతలో కేటాయించిన 70 శాతం ఇళ్ళ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. అర్హులైన పేదలకు సొంత ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు.

=====================

తపాలా శాఖ, రాష్ట్రప్రభుత్వం సంయుక్తంగా నేరుగా నగదు బదిలీ లబ్ధిదారుల సౌకర్యార్థం ఈనెల 15వతేదీ వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా తపాలాశాఖ పోస్టల్ సూపరింటెండెంట్ బి.నరసప్ప తెలిపారు. తిరుపతి తపాలా శాఖ కార్యాలయంలో ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.... ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ తో కొత్త ఖాతాలను తెరవడం, ఆధార్ కార్డ్ లింకేజీని సులభతరం చేసేందుకు ఈ ప్రత్యేక శిబిరాలను సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు.

=====================

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో డంపింగ్ యార్డ్, హెల్త్ పార్కు, శ్మశాన వాటిక సుందరీ కరణ పనులను వేగంగా పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ రోజు మంత్రి ఆయా అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిలిచిపోయిన పనులను ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు.

=====================

ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ప్రతీ నెలా గర్భిణీల ఆరోగ్య తనిఖీల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలు ఎంసిపి కార్డులో నమోదు తప్పనిసరిగా చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. పార్వతీపురం అర్బన్ హెల్త్ సెంటర్ ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమ అమలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. గర్భిణీ, శిశు సంక్షేమ ఆరోగ్య కార్యక్రమాలను వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలని ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆయన ఆదేశించారు. సురక్షిత కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

======================

క్రీడల్లో రాణించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు, ఎంతో శ్రమ, పట్టుదల, ఓర్పు ఉండాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 బాల బాలికల వాలీబాల్ పోటీలను విజయనగరం జిల్లా భోగాపురం జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల మైదానంలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకుని తమ సమర్థతను చాటాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

======================

======================